
అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై విచారణ
● ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు
● ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి
7

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





గజ్వేల్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో నిర్మించిన భూసార పరీక్షా కేంద్రం

భూసార పరీక్షా కేంద్రం అలంకారప్రాయం

● 9 నెలలుగా భూసార పరీక్షల ఊసేలేదు ● పరికరాలు, సిబ్బంది కేటాయింపే కరువు

● ప్రశ్నార్థకంగా గజ్వేల్‌లోని పరీక్షా కేంద్రం భవిష్యత్తు!!

గజ్వేల్, జనవరి 3: లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భూసార పరీక్షా కేంద్రం అలంకారప్రాయంగా మారిపోయింది.

పంట దిగుబడులు గణనీయంగా పెరగడానికి సూచనలు ఇవ్వాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. మట్టి నమునాలు సేకరించి పరీక్షలు నిర్వహించి అన్నదాతలకు దన్నుగా నిలవాలన్న సదుద్దేశంతో గజ్వేల్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో భూసార పరీక్షా కేంద్రాన్ని రూ.81.20 లక్షల వ్యయంతో నిర్మించి, 21, ఏప్రిల్ 2023న అప్పటి జిల్లా మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. నెలలు గడిచినా పరీక్షా కేంద్రానికి సిబ్బందిని కేటాయించింది లేదు. పరికరాలను అందించింది లేదు. దీంతో భూసార పరీక్షలు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి ఉందని రైతులు భావిస్తుండగానే రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరికరాలు, సిబ్బందిని కేటాయిస్తుందా లేదా అన్న ప్రశ్న తలెత్తుతుంది.

జిల్లా కేంద్రంలోనే పరీక్షా కేంద్రం


ప్రస్తుతానికి సిద్దిపేట జిల్లా కేంద్రంలో కేవలం ఒకే ఒక్క భూసార కేంద్రం ఉంది. ఇక్కడికి రైతులు మట్టి నమునాలను తీసుకువెళ్లాలంటే దూరాభారంతో పాటు ఖర్చుతో కూడుకున్న పని. దీంతో రైతులు ఎవరూ భూసార పరీక్షలకు ముందుకు రావడం లేదు. గజ్వేల్‌లో ఏర్పాటు చేసి రైతులకు భూసార పరీక్షలను చేరువ చేయాలన్న ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా కనిపించడం లేదు. ఎంతో హంగు ఆర్భాటంగా భూసార పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించిన గత ప్రభుత్వం... పరికరాలను, సిబ్బందిని కేటాయించకపోవడం ఏంటని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ పరీక్షా కేంద్రానికి ఏడీఏతో పాటు ఏవోలు, ఏఈవోలు, ల్యాబ్ అసిస్టెంట్లు, అటెండర్ల అవసరం ఉంది. పరీక్షల నిమిత్తం పరికరాలు, కెమికల్స్ అవసరమవుతాయి. కానీ వాటిని కేటాయించకపోవడంతో గత ప్రభుత్వ సంకల్పం నెరవేరకపోగా, రైతులకు భూసార పరీక్షలు చేరువయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

భూసార పరీక్షా కేంద్రంతో ఇష్టారీతిన ఎరువుల వాడకానికి చెక్

భూసార పరీక్షా కేంద్రం ఏర్పాటై పరీక్షలు జరిగితే భూమికి అనుగుణంగా పంటలతో పాటు అవసరమైన మేర ఎరువులను వేసుకునే వెసులుబాటు ఉంటుంది. భూసార పరీక్షలు జరపకపోవడంతో రైతులు ఇష్టారీతిన ఎరువులను వినియోగిస్తున్నారు. అంతేకాకుండా వరుసగా ఒకే పంటను వేస్తూ అనేక నష్టాలకు గురవుతున్నారు. సిద్దిపేట జిల్లాలో దాదాపుగా ఆరు లక్షల ఎకరాల్లో ఆయా పంటలను రైతులు సాగుచేస్తున్నారు. నేల స్వభావం తెలియక రైతులు ఎరువులను ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారు. దీంతో దిగుబడులు తగ్గడం, పెరగడం, నేల తన సహజ స్వభావాన్ని కోల్పోవడంతో పాటు రైతులపై ఆర్థిక భారం పడుతుంది. భూసార పరీక్షలు నిర్వహిస్తే పోషకాల లోపాలను గుర్తించి అవసరమైన మేరకే ఎరువులను వినియోగించే వీలు కలుగుతుంది.


కొత్త ప్రభుత్వం చొరవ చూపేనా?

ఇటీవలే రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మొన్నటివరకు ముఖ్యమంత్రిగా ఉన్న గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ మాజీ ముఖ్యమంత్రిగా మారిపోయారు. ఈ నేపథ్యం లో గజ్వేల్‌లో నిర్మించిన భూసార పరీక్షా కేంద్రానికి కావాల్సిన సిబ్బంది, పరికరాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందా లేదా అన్న అనుమానం రైతుల్లో వ్యక్తమవుతున్నది. తొమ్మిది నెలల క్రితం భవనాన్ని నిర్మించినా ఇప్పటి వరకు ఒక్క పరీక్ష జరగక పోవడం గమనార్హం.



నీరుగారిన ఉత్సాహం

ప్రోత్సాహకం లేకుండానే ఐదేళ్లు



● జనవరితో ముగియనున్న సర్పంచుల పదవీకాలం
● సిద్దిపేట జిల్లాలో 48 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం
● నజరానా కోసం ఎదురుచూస్తునే ఉన్న సర్పంచులు
● బీఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై అసంతృప్తి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 3: 2019 జనవరిలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవమైన గ్రామాలకు ప్రోత్సాహకంగా రూ.10లక్షలు అందజేస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామి ఇచ్చింది. నజరాన అందుతుందనే సదుద్దేశంతో పలు గ్రామాల్లో ఆ దిశగా అడుగువేశారు. ఇలా దాదాపు జిల్లాలో 48 గ్రామపంచాయతీల్లో సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే ఈ నెలతో గ్రామపంచాయతీల పాలకవర్గాలకు సంబంధించిన ఐదేళ్ల గడువు పూర్తవుతుంది. ఏ క్షణంలోనైనా మళ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ రావొచ్చు. సర్పంచులు, వార్డు సభ్యులకు ఫిబ్రవరి నుంచి అదనపు సమయంగానే భావించే పరిస్థితి. ఇప్పటికే స్థానిక ఎన్నికలకు సంబంధించిన కసరత్తును అధికార యంత్రాంగం ప్రారంభించింది. ఈ తరుణంలో ప్రోత్సాహక నగదు పొందకుండానే పదవికి కాలం ముగియడంతో ఏకగ్రీవమైన గ్రామాల పాలకవర్గాలు ఉసూరుమంటున్నాయి.

సిద్దిపేట జిల్లాలో 499 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటిలో 48 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవమైన పంచాయతీలకు ఆరునెలల వ్యవధిలోనే రూ.10లక్షల చొప్పున ప్రోత్సహక నిధులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ గడువు పూర్తవుతున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. ఏకగ్రీవ ఎన్నిక జరిగితే ఆయా గ్రామాల్లో ఎలక్షన్ నిర్వహణ లేనందున ఖర్చు ఆదా అవుతుంది. కావున గ్రామాల అభివృద్ధి కోసం ప్రోత్సాహకంగా ప్రత్యేక నిధులను మంజూరు చేస్తారు. ఇలా వచ్చే నిధులతో అదనపు అభివృద్ధి చేసుకోవచ్చని బరిలో ఉన్నవారు హామీలు ఇచ్చి సర్పంచ్‌లుగా, వార్డుసభ్యులుగా కొలువుదీరారు. కానీ ఐదేళ్ల కాలంలో ఒక్కపైసా కూడా మంజూరు కాలేదు.

48 గ్రామాలు ఏకగ్రీవం

సిద్దిపేట జిల్లాలోని వర్గల్ మండలం అనంతగిరిపల్లి, చాంద్‌ఖాన్‌మక్తా, మాదారం, సీతారాంపల్లి, తొగుట మండలం బ్రాహ్మణబంజరుపల్లి, కానుగల్, గోవర్ధనగిరి, సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లి, నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్, కొదండరావుపల్లి, లక్ష్మీదేవిపల్లి, రాయపోల్ మండలం గొల్లపల్లి, ముంగీస్‌పల్లి, నంగునూరు మండలం జేపీ తండా, నాగరాజుపల్లి, మర్కూక్ మండలం ఇప్పలగూడ, మిరుదొడ్డి మండలం బేగంపేట, వీరారెడ్డిపల్లి, కొమురవెల్లి మండలం గౌరాయిపల్లి, రసూలాబాద్, మద్దూరు మండలం హనుమతండా, అక్కన్నపేట మండలం ధర్మారం, గొల్లపల్లి, గుబ్బడి, కుందన్‌వానిపల్లి, మంచినీళ్లబండ, మసిరెడ్డి తండా, మోత్కులపల్లి, పెద్దతండా, పోతారం(జే), బెజ్జంకి మండలం నర్సింహులపల్లి, తిమ్మయ్యపల్లి, చేర్యాల మండలం శబాష్‌గూడెం, దౌల్తాబాద్ మండలం కోనాపూర్, ముత్యంపేట, దుబ్బాక మండలం వెంకటగిరితండా, గజ్వేల్ మండలం కొల్గురు, రాగట్లపల్లి, శేరిపల్లి, హుస్నాబాద్ మండలం భల్లునాయక్‌తండా, రాములపల్లి, జగదేవ్‌పూర్ మండలం అనంతసాగర్, జంగంరెడ్డిపల్లి, కొండాపూర్, నిర్మల్‌నగర్, పీటీ వెంకటాపూర్, తీగుల్‌నర్సాపూర్, కోహెడ మండలం విజయనగర్‌కాలనీ గ్రామపంచాయతీల్లో ఏకగ్రీవంగా పాలకవర్గాలను ఎన్నుకున్నా రు.

ఈ నెలతోనే ఆఖరు

ఏకగ్రీవమైన ఆరునెలల్లో అందాల్సిన నిధులు ఐదేళ్లయినా రాకపోవడంతో ఆయాగ్రామాల సర్పంచ్‌లు తీవ్ర నైరాశ్యంతో ఉన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యామని ఆవేదన చెందుతున్నారు. పంచాయతీలకు రావాల్సిన నిధులు సమయానికి రావడంలేదనే బాధలో ఇప్పటికే సర్పంచులు కొట్టుమిట్టాడుతున్నారు. దీనికితోడు పంచాయతీల్లో ఖర్చులు పెరగడం, వేతనాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకపోవడం వల్ల అప్పులు చేసినవారూ లేకపోలేదు. కనీసం ఏకగ్రీవ నిధులతోనైనా ఉపశమనం కలుగుతుందని భావిస్తే వీటికీ ఎదురుచూపులు తప్పడం లేదు. మరో నెల గడిస్తే మళ్లీ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడుతుంది.

ఎన్నికల సందడి షురూ

ఈ నెలాఖరుతో గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు ముగుస్తుంది. ఈ క్రమంలో ఎన్నికల బరిలో నిలవాలనుకున్న ఆశావహులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గ్రామాల్లో పోటీ వాతావరణం నెలకొన్నది. బీజేపీ సైతం క్షేత్రస్థాయిలో ప్రభావం చూపించడానికి సిద్ధమవుతున్నది. అయితే ఇప్పటికే నోటిఫికేషన్ రావాల్సి ఉండగా జాప్యం జరిగింది. కాగా పార్లమెంటు ఎన్నికల అనంతరమే పంచాయతీ ఎన్నికలు ఉంటాయనే చర్చ జరుగుతున్నది. కానీ అధికారులు అన్ని విధాలుగా ఎన్నికలపై కసరత్తు పూర్తి చేస్తున్నారు. దీంతో ఎన్నికలెప్పుడొచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేని పరిస్థితి కనిపిస్తోంది.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు నాచగిరి లక్ష్మీనరసింహాస్వామి వారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ ఈవో అన్నపూర్ణ

ఉప ముఖ్యమంత్రికి ఆశీర్వచనం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బుధవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో నాచగిరి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్ర అర్చకులు, ఆలయాధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రోచ్చారణలతో భట్టి విక్రమార్క దంపతులను ఆశీర్వదించారు. వారికి లక్ష్మీనరసింహ స్వామి వారి ప్రసాదంతో పాటు స్వామి వారి జ్ఞాపికను ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ అందజేశారు. భట్టి విక్రమార్కను కలిసిన వారిలో నాచగిరి క్షేత్ర ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు, నాగరాజశర్మ, జగనాథచార్యులు, హరిప్రసాద్ శర్మతో పాటు ఆలయాధికారులు సుధాకర్, నరేందర్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

- వర్గల్, జనవరి 3

సిద్దిపేట సీపీగా డాక్టర్ బి.అనురాధ



అనురాధ

సిద్దిపేటక్రైం, జనవరి3: రాచకొండ సైబర్ క్రైమ్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్. బి.అనురాధ సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన శ్వేత డిసెంబరు 17న హైదరాబాద్ డీడీగా బదిలీ అయిన విషయం తెలిసిందే.

సంగారెడ్డి కలెక్టర్‌గా వల్లూరు క్రాంతి



వల్లూరు క్రాంతి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, జనవరి 3: సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా వల్లూరు క్రాంతి నియమితులయ్యారు. ఇంతవరకు కలెక్టర్‌గా ఉన్న డాక్టర్ ఎ.శరత్ ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎ.శరత్ 2022 జూన్ 18న బాధ్యతలు చేపట్టి, 18 నెలలకుపైగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు.

రూ.7కు చేరిన గుడ్డు ధర



చిన్నకోడూరు, జనవరి 3: కోడిగుడ్డు ధర రోజురోజుకు పెరిగిపోతుంది. మాంసాహారం తర్వాత ఎక్కువగా తినే గుడ్డు ధర పెరుగుతుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. సుమారు నెలరోజుల క్రితం ఒక్కో కోడి గుడ్డు ధర రూ.5.50 ఉండగా, పదిహేను రోజుల క్రితం రూ. 6 చొప్పున విక్రయించారు. ప్రస్తుతం కోడి గుడ్డు ధర రూ.7 చొప్పున అమ్ముతున్నారు.

రేటు పెరుగుదలకు కారణాలు

కార్తీక మాసం ముగిశాక గుడ్డు, చికెన్ వినియోగం పెరిగింది. చలి తీవ్రతకు గుడ్ల ఉత్పత్తి తగ్గింది. మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గట్టుగా గుడ్లఉత్పత్తి లేకపోవడం, దాణ ధరలు పెరగడం వల్ల గుడ్డు ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ఇటీవల క్రిస్మస్, న్యూఇయర్ వేడుకలకు కేక్‌ల తయారీకి బేకరి నిర్వాహకులు గుడ్లను పెద్ద మొత్తంలో కొనుగోలు చేయడం గుడ్డు రేటు పెరగడానికి మరో కారణంగా చెప్పవచ్చు. కార్తీక మాసంలో కిలో చికెన్ (స్కిన్ లెస్) రూ.180 ఉండగా, ప్రస్తుతం కిలో చికెన్ రూ. 220చొప్పున విక్రయిస్తున్నారు.



పౌల్ట్రీ ఫామ్‌లో కోళ్లు

కల్తీ మందులు అమ్మితే చర్యలు

కొండపాక/జగదేవ్‌పూర్, జనవరి 3: కల్తీ మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. కుకునూరుపల్లిలోని పలు ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ షాపులను బుధవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రైతులకు సరైన సేవలందిస్తూ వారు తీసుకున్న వాటికి రసీదులు అందివ్వాలని, ప్రతి దానికి బిల్ ఉండాలని తెలిపారు. షాప్‌లో కంపెనీలు వస్తువుల వివరాలతో పంపించే డాక్యుమెంట్స్ ఉంచాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ అధికారిని ప్రియదర్శిని ఉన్నారు. అలాగే జగదేవ్‌పూర్‌లోని ఎరువులు, విత్తన, పురుగు ముందుల డీలర్లకు జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం దౌలాపూర్ రైతు సత్యనారాయణరెడ్డి పొలంలోని పంటలను పరిశీలించారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి: ఏసీపీ

హుస్నాబాద్, జనవరి 3: పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని హుస్నాబాద్ ఏసీపీ సతీష్ పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో హుస్నాబాద్ సర్కిల్ పోలీసు అధికారులతో నిర్వహించిన పెండింగ్ కేసుల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గంజాయి, కొకైన్, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి నిర్మూలించాలన్నారు. వరంగల్, కరీంనగర్ జిల్లాల సరిహద్దులో ఉన్నందున తరచూ వాహనాలను తనిఖీ చేయాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో టార్గెట్‌కు మించి ఎక్కువ కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉండవద్దని, కేసులను ఛేదించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయాలని సూచించారు. మాస్కులు లేకుండా బయట తిరిగే వ్యక్తులపై పెట్టీ కేసులు నమోదు చేయాలన్నారు. నేరాల నియంత్రణకు పోలీసు గస్తీ, నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్కిల్ పోలీసులు ఏసీపీ సతీష్‌కు నూతన సంవత్సరం సందర్భంగా పూల మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎర్రల కిరణ్, ఎస్ఐలు మహేశ్, వివేక్, తిరుపతి పాల్గొన్నారు.



ఏసీపీ సతీష్‌కు పూల మొక్క అందజేస్తున్న సీఐ కిరణ్‌తో పాటు ఎస్ఐలు

సెంట్రింగ్ బాక్సుల దొంగలపై కేసు

చిన్నశంకరంపేట, జనవరి 3: రాత్రివేళలో సెంట్రింగ్ బాక్సులను దొంగిలించిన ముగ్గురు వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. చిన్నశంకరంపేట మండలంలోని కొర్విపల్లి, చెన్నాయిపల్లి, మడూర్ గ్రామాల్లో మూడు రోజుల క్రితం మాసాయిపేటకు చెందిన సోహెల్, అంబాజిపేటకు చెందిన శరత్‌ప్రసాద్, చందాపూర్‌కు చెందిన ప్రశాంత్ సెంట్రింగ్ బాక్సులను దొంగిలించారు. మంగళవారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో మండల కేంద్రంలోని అనంత పద్మనాభ గుట్ట వద్ద ట్రాలీ ఆటోలో సెంట్రింగ్ బాక్సులను తరలిస్తున్నారు. పోలీసులకు అనుమానం కలుగడంతో ముగ్గురిని పట్టుకుని విచారించగా బాక్సులను దొంగిలించినట్లు తెలిపారు. గతంలో కూడా తూప్రాన్, శివంపేట, వెల్దుర్తి, మెదక్, భూంపల్లి, దౌల్తాబాద్‌లో వారిపై మొత్తం 11 చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు. దుండగుల వద్ద 1135 సెంట్రింగ్ బాక్సులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నారాయణగౌడ్ వెల్లడించారు.

బస్సు ఆపని డ్రైవర్.. కిందికి దూకిన మహిళ

● కాలు పైనుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయిన కాలు

శివ్వంపేట, జనవరి 3: ఆర్టీసీ బస్సు నుంచి కిందపడి ఓ మహిళ గాయపడింది. శివ్వంపేట మండలంలోని ఉసిరికపల్లి పంచాయతీ తౌర్యతండాకు చెందిన దేవ్లీ అనే మహిళ బుధవారం మండల కేంద్రమైన శివ్వంపేటలోని పీఏసీఎస్ బ్యాంకుకు పనిమీద వెళ్లడానికి ఉసిరికపల్లి చౌరస్తా వద్ద బస్సు ఎక్కింది. బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఉండటం, దిగాల్సిన స్టేజీ దాటి పోవడంతో బస్సు ఆపాలంటూ డ్రైవర్, కండక్టర్‌ను కోరింది. వారు ఆపకపోవడంతో కొద్దిదూరం వెళ్లాక బస్సు మెల్లగా వెళ్తుండడంతో దిగేందుకు ప్రయత్నించి కిందపడింది. దీంతో బస్సు చక్రాలు ఆమె కాళ్ల పైనుంచి వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే ఆమెను నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడ ప్రాథమిక వైద్యం చేసి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ శివారులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


తీవ్రంగా గాయపడ్డ దేవ్లీ

ఆటో, బైక్ దొంగల అరెస్ట్

మెదక్ అర్బన్, జనవరి 3: జిల్లా కేంద్రంలో చోరీకి గురైన ఆటో, బైక్ దొంగలను అరెస్టు చేసి.. రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ వెంకటేష్ తెలిపారు. గతేడాది నవంబరులో పట్టణానికి చెందిన కుమ్మరి సత్యనారాయణ ఇంటి ఎదుట పార్కు చేసిన బైక్‌ను రంగారెడ్డి జిల్లా కర్మాన్‌ఘట్‌కు చెందిన దేవతమ్మల శివ ఎత్తుకెళ్లాడు. బుధవారం కామారెడ్డి వైపు బైక్‌ను అమ్ముదామని వెళ్తుండగా.. పోలీసులు పట్టుకుని పత్రాలు తనిఖీ చేయగా చోరీ చేసి తెచ్చినట్టు ఒప్పుకున్నాడు.

మెదక్ మండల పరిధిలోని గ్రామానికి చెందిన కిష్టయ్య ఆటో రిపేర్ కోసం గతేడాది డిసెంబరు 5న వెల్‌కం బోర్డు వద్ద హెచ్‌పీ పెట్రోల్ పంపులో పార్కు చేయగా.. ఆటోను దొంగిలించాడు. వడ్డెర కాలనీకి చెందిన ఉప్పు నవీన్, దౌల్తాబాద్ మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన జోగు స్వామిలు కలిసి ఆటోను విక్రయించడానికి వెళ్తుండగా.. పోలీసులు పట్టుకున్నారు. వారి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

5న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా

● జిల్లా ఉపాధి అధికారి వందన

సంగారెడ్డి రూరల్, జనవరి 3: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈ నెల 5న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి వందన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డులో పాత వెలుగు ఆఫీస్‌లో గల జిల్లా ఉపాధి కార్యాలయ ఆవరణలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాలలోపు ఉండి పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హతలు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు సకాలంలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, పూర్తి సమాచారం కోసం 08455-271010 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై విచారణ

● ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు
● ఆదేశించిన సీఎం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి), జనవరి 3: ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాలలో జరిగిన అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై విచారణకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిసింది. కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌తో పాటు మెదక్, సంగారెడ్డి జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా ఇటీవల సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. అసైన్డ్ భూములు ఎలా అన్యాక్రాంతమయ్యాయి..? అక్రమార్కుల చేతుల్లోకి ఎలా వెళ్లాయి..? అన్న అంశాలపై కాంగ్రెస్ నాయకులు వివరాలతో పేర్కొన్నట్లు తెలిసింది. సిద్దిపేట ప్రాంతంలో అభివృద్ధి పేరిట అసైన్డ్ భూములను తీసుకొని సొంత పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా సంగారెడ్డి, మెదక్ ప్రాంతాలలో అసైన్డ్ భూములను కొందరు గతంలోనూ అధికార పార్టీ నేతలు, వారి అనుచరుల పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కాంగ్రెస్ నాయకులు వివరించారు. సిద్దిపేట, మిట్టపల్లి ప్రాంతాలలోని నాలుగు సర్వే నెంబర్లలో ఉన్న సుమారు 80ఎకరాల అసైన్డ్ భూములను అభివృద్ధి పేరిట అక్రమంగా ఆక్రమించుకున్నారని తమ ఫిర్యాదులో కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. అలాగే సంగారెడ్డి పట్టణ శివారులలోని అసైన్డ్ భూములతో పాటు రామచంద్రాపురం మండలం కొల్లూరు, తెల్లాపూర్, మండల కేంద్రమైన అమీన్‌పూర్, పటాన్‌చెరు, జిన్నారం మండలాలలోని విలువైన భూములను గతంలోని అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, సహకరించడంతో కోట్ల విలువైన అసైన్డ్ భూములు చేతులు మారాయని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఇక జిన్నారం మండలం గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని 900 ఎకరాల అసైన్డ్ భూమి టీఎస్ఐఐసీ సేకరించి, ప్రైవేటు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్న యాజమాన్యాలకు అప్పగించిందని వారు ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతంలో రూ.5కోట్ల చొప్పున ఉన్న ఎకరా భూమిని తమ నుంచి కోటి రూపాయలకు ఎకరా చొప్పున లాక్కున్నారని అక్కడి రైతులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. పంటలు పండించుకొని జీవిస్తున్న తమ అసైన్డ్ భూములను పరిశ్రమల ఏర్పాటు పేరిట అధికారులు బలవంతంగా తీసుకున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ శివారు ప్రాంతాలైన సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై విచారణ జరిపించి, చర్యలు తీసుకుంటామని ఎన్నికలకు ముందే పీసీసీ చీఫ్ హోదాలో ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా ఇప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లాలోని కొందరు కాంగ్రెస్ నాయకులు, రైతులు అసైన్డ్ భూముల భాగోతంపై ఫిర్యాదు చేయడంతో ముఖ్యమంత్రి విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

డీఈవో ఆఫీస్‌లో కనిపించని సమాచార హక్కు చట్టం బోర్డు

● జిల్లా విద్యాధికారి కార్యాలయంలో నిర్లక్ష్యం
● ఏ అధికారి పనిచేస్తున్నారో తెలియక ప్రజల అయోమయం



సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయ ప్రవేశ ద్వారం వద్ద కనిపించని సమాచార హక్కు చట్టం బోర్డు

సంగారెడ్డి అర్బన్, జనవరి 3: ఏ ప్రభుత్వ శాఖ కార్యాలయంలోనైనా సమాచార హక్కు చట్టం బోర్డు ప్రదర్శిస్తారు. అప్పిలేట్ అథారిటీ(అధికారి), పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ పేర్లతో బోర్డు రాసి ఉంచుతారు. కానీ సంగారెడ్డిలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మాత్రం ఆ బోర్డు లేదు. వివిధ పనుల నిమిత్తం ఆ శాఖ కార్యాలయానికి వివిధ వర్గాల ప్రజలు, ఉద్యోగులు ఇతరులు వచ్చిపోతుంటారు. ఈ క్రమంలో ఈ శాఖలో పనిచేస్తున్న ప్రధాన అధికారి, ఇతర అధికారులెవరో తెలుసుకోవాలంటే ఏర్పాటు చేసిన స.హ చట్టం బోర్డు చూస్తే సరిపోతుంది. కానీ మూడేళ్లగా ఈ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డును మూలకు చేర్చినట్లు సిబ్బంది చెప్పడం గమనార్హం. కార్యాలయం ప్రవేశం వద్ద సమాచార హక్కు చట్టం బోర్డు ప్రదర్శించాలన్న అవగాహన లేదా, అంత నిర్లక్ష్యంగా కార్యాలయ అధికారులు విధులు నిర్వహిస్తున్నారా అంటూ పలువురు ఆర్టీఐ యాక్టివిస్టులు మండిపడుతున్నారు.

జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

● సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్



పదో తరగతి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక బుక్ లెట్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి రూరల్, జనవరి 3: జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ శరత్‌కు అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అన్నిరంగాల్లో ముందు ఉంచేందుకు అధికార యంత్రాంగమంతా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా అధికారులందరూ అంకితభావంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. నూతన సంవత్సరం అన్నీ శుభాలు చేకూర్చాలని, ప్రతిఒక్కరూ మరింత నూతనోత్తేజంతో పనిచేసి జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని కలెక్టర్ శరత్ కోరారు. జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, వ్యవసాయ శాఖ జేడీ నర్సింహారావు, డీఎల్పీవో సతీష్‌రెడ్డి, డీపీఆర్‌వో విజయలక్ష్మి, జిల్లా అధికారులు మోహన్‌రెడ్డి, సంధ్యారాణి, పిరంగి, సతీష్‌కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి

సంగారెడ్డి అర్బన్, జనవరి 3: పదో తరగతి ఫలితాల్లో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లా విద్యాశాఖ తయారుచేసిన పదో తరగతి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక బుక్‌లెట్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక బుక్‌లెట్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల విద్యాధికారులు, పాఠశాలల దత్తత అధికారులు ఈ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ఆచరిస్తూ మార్చి 2014లో జరుగు పదో తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి విజయకుమార్, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సైబర్ క్రైం కేసుల్లో నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసులు

సంగారెడ్డి క్రైం, జనవరి 2: దేశవ్యాప్తంగా 277 సైబర్ క్రైం కేసులలో నిందితుడిగా ఉన్న వ్యక్తిని సంగారెడ్డి జిల్లా సైబర్ క్రైం పోలీసులు బుధవారం జిల్లా కోర్టులో హాజరుపరిచారు. బెంగుళూర్‌లోని జేపీ నగర్‌కు చెందిన జితేందర్‌సింగ్(30) దేశవ్యాప్తంగా 277 సైబర్ నేరాలకు పాల్పడ్డాడు. తెలంగాణలో కూడా అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని మోసాలకు పాల్పడ్డాడు. రాష్ట్రవ్యాప్తంగా 84 కేసులతో పాటు సంగారెడ్డి జిల్లాకు చెందిన 5 కేసులలో అతడు నిందితుడిగా ఉన్నాడు. సైబర్ నేరాలకు పాల్పడటానికి ఇతడు 60 ఫోన్ నంబర్లు, 63 ఫోన్ ఐఎంఇఐ నంబర్లు, 13 బ్యాంకు ఖాతాలను వినియోగించాడు. సంగారెడ్డి జిల్లాకు చెందిన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్‌లో, బీడీఎల్ భానూర్ పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిగా ఉన్న నేరస్థుడిని జిల్లా సైబర్ క్రైం పోలీసులు పీటీ వారెంట్‌పై సంగారెడ్డి జిల్లా కోర్టులో బుధవారం ప్రవేశపెట్టారు. నేరాలకు పాల్పడిన తీరు గురించి అడిగి కోర్టులో రికార్డు చేశారు. అయితే ఇదివరకే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేయగా.. చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్పీ

ఆన్‌లైన్ మోసాలపై, సైబర్ నేరాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. డబ్బులు ఉచితంగా వస్తున్నాయంటే దానికి వెనుక ఏదో కుట్ర ఉన్నదన్న విషయాన్ని గమనించాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

మెదక్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన రేషన్ డీలర్లు

మెదక్ అర్బన్, జనవరి 3: రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో మెదక్ కలెక్టర్ రాజర్షిషాను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు సుధాకర్, భిక్షపతి, నర్సింలు, గోవర్ధన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

● ఈనెల 18,19 తేదీల్లో నిర్వహణ
● డీఈవో రాధాకిషన్

మెదక్ అర్బన్, జనవరి 3: ఈ విద్యా సంవత్సరం జిల్లాస్థాయి విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. ఈ నెల 10 తేదీలోపు ఆన్‌లైన్‌లో విద్యార్థులు పేర్లు నమోదు చేసుకునేలా అన్ని పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను వారి పాఠశాలల్లోనే ఏర్పాటు చేసుకోవాలని, వాటికి సంబంధించిన వీడియోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆరోగ్యం, పర్యావరణహిత జీవన విధానం, వ్యవసాయం, కమ్యూనికేషన్, రవాణా, కంప్యూటేషనల్ థింకింగ్‌పై ఈ నెల 18, 19వ తేదీల్లో ప్రదర్శనలు ఉంటాయన్నారు. 6 నుంచి 8వ తరగతి వరకు జూనియర్, 9 నుంచి 10వ తరగతి వరకు సీనియర్ విభాగాలుగా పరిగణిస్తారన్నారు. సైన్స్ గణిత ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి 8328599157 సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ఐదో తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు చివరి తేదీ 6

హుస్నాబాద్‌రూరల్, జనవరి 3: హుస్నాబాద్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 6 వరకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం 11 నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహించనునట్లు పేర్కొన్నారు. ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2023, 2024లో నాల్గవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పూర్తి వివరాలకు 9704550176 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కోరారు.

ఐఐటీహెచ్‌లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించండి

● ఐఐటీహెచ్ డైరెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, జనవరి 3: ఐఐటీహెచ్‌లో చుట్టుపక్కల గ్రామాల నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తిని కోరారు. బుధవారం సాయంత్రం ఆయన పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి కంది పరిధిలోని ఐఐటీహెచ్‌కు వెళ్లి డైరెక్టర్‌ను కలిశారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలామంది యువతీ, యువకులు ఉన్నత చదువులు చదువకుని, ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారందరికి ఐఐటీహెచ్‌లో ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. అంతేగాక ఐఐటీహెచ్ పరిసర గ్రామాల అభివృద్ధికి ఐఐటీహెచ్ తరఫున సహకారం అందించాలన్నారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో సీడీసీ ఛైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, ఆత్మకమిటీ ఛైర్మన్ కృష్ణాగౌడ్, నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి ఉన్నారు.

మహనీయుల అడుగుజాడలు అనుసరణీయం

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, స్థానిక ప్రజలు

గుమ్మడిదల, జనవరి 3: మహనీయుల అడుగుజాడలు అనుసరణీయమని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన అందిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో వర్తక సంఘం నూతన కార్యాలయం ప్రారంభోత్సవం, జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ నూతన ఆలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. పటాన్‌చెరు నియోజవకవర్గ వ్యాప్తంగా సొంత నిధులతో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తూ వారి ఆశయాలను భవిష్యత్తు తరాలకు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణావిజయభాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ నరసింహారెడ్డి, వైస్ ఎంపీపీ మంజుల, సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఇందేల సురేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు హుస్సేన్ పాల్గొన్నారు.

యాసంగిలో వరి నారు పెంపకంలో జాగ్రత్తలివిగో!

● ఉష్ణోగ్రతలు తగ్గడంతో నారు ఎదగదు
● ముదురు నారు నాటడంతో దిగుబడి తగ్గుతుంది
● యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి

సిద్దిపేటరూరల్, జనవరి 3: యాసంగిలో సాగు చేసే పంటలలో వరి ప్రధానమైనది. ముఖ్యంగా సిద్దిపేట జిల్లాలో యాసంగిలో స్వల్పకాలిక దొడ్డు గింజ రకాలైన ఎం.టీ.యూ. 1010, తెల్లహంస, ఐ.ఆర్. 64, కూనారం సన్నాలు (కె.ఎన్.ఎం-118), బతుకమ్మ, జగిత్యాల రైస్-1(జె.జి.ఎల్.-24423), అలాగే సన్న గింజ రకాలైన తెలంగాణ సోనా, హెచ్.ఎం.టి. సోనా ప్రైవేట్ కంపెనీకి చెందిన రకాలను జనవరి మొదటి వారం వరకు నారు పోసుకొని రైతులు సాగుచేసుకోవాలి. యాసంగిలో రాత్రి ఉష్ణోగ్రతలు 12 డిగ్రీ సెల్సియస్ కంటే తక్కువ ఉన్నందున, చలి తీవ్రత పెరిగి నారు సరిగా ఎదగక ఎర్రబడి కొన్నిసార్లు చనిపోతుంది. అలాగే యాసంగిలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయబడుతున్న స్వల్పకాలిక దొడ్డు గింజ రకాలలో ముదురు నార్లు నాటడం వల్ల దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయి. వరినార్లు సరిగా ఎదగకపోవడం వల్ల వరినాట్లు ఆలస్యం అవుతుండడం పొలంలో మొక్కలు త్వరగా ఏనుకోకపోవడం వరి పాటి. వరి నాట్లు మరీ ఆలస్యమైతే పంట కోతలు ఆలస్యమై మేలో వచ్చే నీటి ఎద్దడికి గురయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలో తరచుగా వచ్చే వడగండ్ల వర్షాలకు పంట నష్టం వాటిల్లే ప్రమాదమూ ఉంటుంది. రైతులు యాసంగి వరి నారుమడి పెంపకంలో మెళకువలు పాటించి ఆరోగ్యవంతమైన నారు పెంచి సరైన సమయంలో నాట్లు వేసుకోవాలని వ్యవసాధికారులు సూచిస్తున్నారు.

- రైతులు ఖరీఫ్‌లో పండించిన విత్తనాలను యాసంగిలో సాగు చేయాలనుకున్నట్లయితే పండించిన రకం విత్తన నిద్రావస్థ గురించి అవగాహన ఏర్పరుచుకోవాలి. సాధారణంగా తెలంగాణ సోనా, ఎం.టి.యూ. 1010 రకాలను 2 వారాలు... అలాగే కూనారం సన్నాలు (కె.ఎన్.ఎం-118), బతుకమ్మ, ఎం.టి.యూ. 1001 రకాలను 3 వారాల నిద్రావస్థ ఉందని గమనించాలి. నిద్రావస్థ తొలగించడానికి లీటర్ నీటికీ 6.3 మి.లీ. గాఢ నత్రికామ్లం కలిపిన ద్రావణంలో కిలో విత్తనాన్ని 24 గంటలు నానబెట్టి కడిగి మండే కట్టాలి.

విత్తన శుద్ధి ఇలా..

మెట్ట నారుమళ్లకు అయితే కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండాజిమ్‌ను తడితో పట్టించి ఆరబెట్టి నారుమడిలో చల్లుకోవాలి. దమ్ము చేసిన నారుమళ్లు అయితే లీటర్ నీటికి 1గ్రా. కార్బండాజిమ్ కలిపిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టిన తర్వాత మండే కట్టి మొలకలను నారుమడిలో చల్లుకోవాలి.

- నారుమడి తయారీకి 1-2 వారాల ముందు 2 గుంటల నారుమడికి 2 క్వింటాలు, బాగా మాగిన గొర్రెల ఎరువు లేదా కోళ్ల ఎరువు లేదా వర్మీ కంపోస్టు వేసి పొలాన్ని బాగా కలియదున్నాలి. ఒక ఎకరానికి సరిపడా (2గుంటలు) నారుమడి అడుగులో 1కిలో నత్రజని, 2కిలోల భాస్వరం, 1కిలో పొటాష్ నిచ్చే ఎరువులను వేయాలి. నారు 15 నుంచి 20 రోజుల దశలో పైపాటుగా 1కిలో నత్రజని (2కిలోల యూరియా) వేసుకోవాలి. అలాగే వరి నాటడానికి వారం ముందు కార్బోఫ్యూరాన్ 3జి. 800గ్రా. 2 గుంటల నారుమడికి వేయాలి.

- యాసంగిలో చలి సమస్యను అధిగమించడానికి నారుమళ్లపైన ఇనుప చువ్వలు/వెదురు కర్రలతో ఊతం ఇచ్చి పైన పలుచని పాలిథిన్ షీట్ లేదా పాలిప్రూవెన్ యూరియా బస్తాలతో తయారు చేసిన పట్టాలను సాయంత్రం వేళల్లో కప్పి ఉంచి మరుసటి రోజు ఉదయాన్నే తీసివేయాలి. అలాగే రాత్రివేళల్లో నారుమడిలో నీరు నిండుగా ఉంచి తెల్లవారుజామున తీసివేసి కొత్తనీరు పెట్టాలి. నారు ఆరోగ్యవంతంగా పెరగడానికి పైపాటుగా 2 గుంటల నారుమడికి కిలో యూరియాకు 2.5గ్రా. కార్బండాజిమ్+మ్యాంకోజెబ్ కలిపి వేసుకోవాలి.

- యాసంగిలో చలి ప్రభావం వల్ల నారుమడిలో జింక్ లోప లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. జింకు లోప సవరణకు లీటరు నీటికి 2గ్రా. జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. నారుమడిలో ఊద, ఒడిపిలి వంటి గడ్డి జాతి కలుపు మొక్కలు ఉన్నట్లయితే విత్తిన 15 నుంచి 20 రోజుల్లో సైహలోఫాప్-పి-బ్యూటిల్ 1.5మి.లీ. లేదా బిస్ పైరిబాక్ సోడియం 0.5మి.లీ.ను లీటరు నీటికి కలిపి నారుమడిలో నీరు తీసివేసి పిచికారీ చేయాలి. చలి వాతావరణం వల్ల యాసంగి నారుమడిలో అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉన్నది. నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6గ్రా. లేదా ట్రైసైక్లోజోల్+ మ్యాంకోజెబ్ 2.5గ్రా. లేదా ఐసోప్రొథయోలేన్ 1.5మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. వరి నారు పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించి ఆరోగ్యవంతమైన వరి నారు సరైన సమయంలో నాట్లు వేసుకున్నట్లయితే యాసంగిలో అధిక దిగుబడులను సాధించవచ్చు.





తోర్నాలలో సాగుచేసిన నారుమడి, ముదురు నారు నాటు వేయడం వల్ల ఎర్రబడిన వరి కర్రలు(ఫైల్)

ఆటోను ఢీకొన్న లారీ

● అయ్యప్ప మాలధారుడి మృతి
● మరో నలుగురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం





అయ్యప్ప మాలధారుడు కాశయ్య మృతదేహం వద్ద రోధిస్తున్న కుమారులు, ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో



ఎంబరి కాశయ్య(ఫైల్)



తీవ్రంగా గాయపడిన వల్లూరి విఠల్

కల్హేర్, జనవరి 3: లారీ ఢీకొనడంతో ఆటోలో వెళ్తున్న అయ్యప్ప మాలధారుడు మృతిచెందాడు. మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఆరుగురు అయ్యప్ప స్వామి మాలధారులు తోటి స్వాముల ఆహ్వానం మేరకు కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండల పరిధిలోని మల్కాపూర్‌లో జరిగిన పడిపూజకు వెళ్లి తిరిగి వస్తున్నారు. మండల సరిహద్దులో ఉన్న కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ గ్రామ సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న ఆటోను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎంబరి కాశయ్య(55) అక్కడికక్కడే మరణించగా.. అంజయ్య, విఠల్, లింగంలకు తీవ్ర గాయాలు కాగా, డ్రైవర్ సాయిలుకు స్వల్ప గాయాలైనట్లు వారు తెలిపారు. ఇందులో అంజయ్యకు కాళ్లు విరగగా, విఠల్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయనను హైదరాబాద్‌కు తరలించారు. మిగతా వారిని ఎల్లారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఘటనా స్థలాన్ని నిజాంసాగర్ ఎస్ఐ రాజశేఖర్ పరిశీలించి.. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ ఘటన వల్ల మాసాన్‌పల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భార్యతో గొడవపడి ఆత్మహత్య



మహిపాల్(ఫైల్)

మెదక్ అర్బన్, జనవరి 3: భార్యాభర్తల మధ్య గొడవతో భర్త మనస్తాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మెదక్ మండల పరిధిలోని మగ్దూంపూర్‌లో మంగళవారం చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహిపాల్(24)కు ఎనిమిది నెలల క్రితం చిన్నశంకరంపేట మండలానికి చెందిన దీపికతో వివాహం జరిగింది. అప్పటి నుంచి వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. నెలరోజుల కిందట భార్య దీపిక పుట్టింటికి వెళ్లి.. పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. నాటి నుంచి మహిపాల్ బాధపడుతూ ఉన్నాడు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో మహిపాల్ మెదక్‌కు వెళ్లి తిరిగి వచ్చాడు. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చి చూడగా.. మహిపాల్ ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే చుట్టుపక్కల వారి సహాయంతో మృతదేహాన్ని కిందకు దింపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి బీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అమర్ తెలిపారు.

రాజిరెడ్డిపల్లి కుంటలో పడి మహిళ మృతి

గజ్వేల్, జనవరి 3: మతిస్థిమితం లేని మహిళ కుంటలో పడి మృతిచెందిన సంఘటన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లిలో చోటుచేసుకున్నది. గజ్వేల్ మునిసిపాలిటీ పరిధిలోని 14వ వార్డుకు చెందిన బొబ్బిలి సాలవ్వ(47) బుధవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాలవ్వ ఆచూకీ కోసం భర్త వీరాస్వామి, కుమారుడు శ్రీకాంత్ వెతుకుతుండగా, చుట్టుపక్కల వారు చూసి సాలవ్వ రాజిరెడ్డిపల్లి కుంట వైపు వెళ్లిందని చెప్పారు. ఇంతలోగా వెళ్లి చూసేసరికి రాజిరెడ్డిపల్లి కుంటలో పడి మృతిచెంది కనిపించింది. సాలవ్వ కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ జానొరెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బెజ్జంకి, జనవరి 3: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని రేగులపల్లి రాజీవ్ రహదారిపై బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. రేగులపల్లి పంచాయతీ కార్యదర్శి జీవన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగిన యువకుడి మృతి



వినయ్(ఫైల్)

రాయపోల్, జనవరి 3: పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బేగంపేట ఎస్ఐ అరుణ్ వివరాల ప్రకారం.. రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన చాకలి వినయ్(16) స్నేహితులతో కలిసి చెడు తిరుగుళ్లకు అలవాటుపడ్డాడు. చెడు తిరుగుళ్లు మానుకుని ఏదైనా పని చేసుకోవాలని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన వినయ్ గతనెల 29న గ్రామంలోని పాఠశాల వద్ద గడ్డి మందు తాగి, దానిని తన ఫోన్‌లో స్టేటస్‌గా పెట్టుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని వెతికి పట్టుకునేలోగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా.. వెంటనే వంటిమామిడిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. తండ్రి ఎల్లోల్ల చంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో, స్కూల్ బస్సు ఢీ, ఒకరి మృతి

● మరొకరికి గాయాలు, జిల్లా కేంద్రంలో ఘటన

మెదక్ అర్బన్, జనవరి 3: ఆటో, స్కూల్ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా.. మరొకరికి గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. పట్టణ సీఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని డాన్‌బాస్కో స్కూల్‌కు చెందిన బస్సు కోర్టువైపు వెళ్తుండగా.. బోధన్ చౌరస్తా వైపు నుంచి అతివేగంగా వస్తున్న ఆటో బస్సు ఎడమవైపు వెనుక టైర్‌కు ఢీకొట్టింది. దాంతో ఆటోడ్రైవర్‌కు ఎడమవైపు కూర్చున్న హవేళీఘణపూర్‌కు చెందిన రవీందర్(50)కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు. గాయపడ్డిన ఆటోడ్రైవర్ అన్వర్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

స్కూటీ అమ్ముతానంటూ రూ.75 వేలకు కుచ్చుటోపీ

హత్నూర, జనవరి 3: ఆన్‌లైన్ మోసానికి మరో యువకుడు బలయ్యాడు. డబ్బులు చెల్లించిన ఆ యువకుడు మోసపోయానని గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన చిలప్‌చెడ్ నవీన్ అనే యువకుడు మంగళవారం ఫేస్‌బుక్‌లో అమ్మకానికి పెట్టిన స్కూటీ వాహనాన్ని చూశాడు. ఆ ఫేస్‌బుక్‌లో ఉన్న సెల్‌ఫోన్ నెంబరుకు ఫోన్‌చేసి ధర అడుగగా.. రూ.18 వేలు అని తెలిపాడు. అంతేకాకుండా అతడి వాట్సప్‌కు ఆర్సీ కూడా పంపాడు. అయితే అన్ని సరిగ్గా ఉన్నాయని భావించిన నవీన్ అమ్మకందారుడి ఫోన్‌పే నెంబరుకు రూ.18 వేలు పంపాడు. ఆ డబ్బులు నా అకౌంట్‌లో కనిపించడం లేదని, మరో రూ.13 వేలు పంపితే కనిపిస్తాయని స్కూటీ యజమాని చెప్పడంతో నవీన్ మళ్లీ రూ.13 వేలు ఫోన్ పే చేశాడు. ఇలా నాలుగు దఫాలుగా మొత్తం రూ.75 వేలు ఫోన్‌పే ద్వారా పంపాడు. ఈ పూర్తి డబ్బులు వారి అకౌంట్‌లో పడగానే సదరు వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. దీంతో తాను మోసపోయానని భావించిన ఆ యువకుడు వెంటనే 1903 నెంబరుతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు.



హుస్నాబాద్‌లో సావిత్రిబాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



చిన్నకోడూరులో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



చేర్యాలలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ మహిళా నాయకులు



మిరుదొడ్డి: భూంపల్లిలో సాయిత్రిబాయి జయంతి కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

నేటి తరం మహిళలకు సావిత్రిబాయి పూలే స్ఫూర్తి



వర్గల్: మహాత్మాజ్యోతిబాపూలే గురుకులంలో సావిత్రిబాయి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

మహిళల విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థలతో పాటు పలు సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యాసంస్థల్లో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. సావిత్రిబాయి పూలేను స్ఫూర్తిగా తీసుకుని నేటితరం మహిళలు ముందుకు సాగాలని పలువురు పిలుపునిచ్చారు.

హుస్నాబాద్ టౌన్, జనవరి 3: బాలికల విద్యకు బాటలు వేసింది సావిత్రిబాయి పూలే అని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మిత్ర మండలి-87 బ్యాచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పాల్గొని సావిత్రి బాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఆయిలేని అనిత, మిత్రమండలి-87 బ్యాచ్ అధ్యక్షుడు బూట్ల రాజమల్లయ్య, కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, చిత్తారి పద్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.



కోహెడలో సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

● **చిన్నకోడూరు:** మండలకేంద్రంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కాముని ఉమేష్ చంద్ర, బీఆర్ఎస్ నాయకుడు జంగిటి శ్రీనివాస్ తదితరులు సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె భర్త తో కలిసి సామాజిక సమానత్వం కోసం పోరాడిన త్యాగశీలి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు సుభాష్, లింగం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** చేర్యాలలో మహిళా కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దాసరి కళావతి, స్వరూప, వంగ జయ, తోళ్ల రాజేశ్వరి, దాసరి సబిత, రేష్మ, సుమలత, హరిత, లక్ష్మి, తార తదితరులు పాల్గొన్నారు. అలాగే చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** చదువులతల్లి సావిత్రిబాయి పూలేను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలో సావిత్రిబాయిపూలే విగ్రహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. అలాగే అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలోని ప్రాథమిక పాఠశాలలో, దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామంలో బీమ్‌శేఖర్ ఆధ్వర్యంలో, మిరుదొడ్డి మండలం అందె గ్రామంలో సీసీసీ సభ్యుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.



దూళిమిట్టలో సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

● **వర్గల్:** మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాలలో సాయిత్రిబాయి పూలే వేషధారణలో విద్యార్థులు పలు ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ గోవందరావు, కళాశాల సిబ్బంది భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

● **బెజ్జంకి:** మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మంజుల, పాలకవర్గ సభ్యులు అలాగే స్వేరోస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా అధ్యాపకులను స్వేరో సభ్యులు శాలువాలతో సన్మానించి విద్యార్థినిలకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో స్వేరో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్ కుమార్,జిల్లా నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బెజ్జంకిలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్వేరో సభ్యులు

● **మద్దూరు:** దూళిమిట్ట మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల గ్రంథాలయం ముందు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ పోతరాజు లింగం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రచ్చ లక్ష్మయ్య, కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు గద్దల మహేందర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● **కోహెడ:** కోహెడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద పలు సంఘాల ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నిరుపేదలకు పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మండల అంబేడ్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు మంద మల్లేశం, దళిత సంఘాల జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల శంకర్, ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు తేలు యాదగిరి, బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశ్వర్లు, పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **నంగునూరు:** మండలకేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవుళ్లపల్లి యాదగిరి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆరెపల్లి కనకయ్య, కందికట్ల రాజు, నాయకులు చెలికాని యాదగిరి, రాగుల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ 19వ వార్డులో అక్షింతలను పంపిణీ చేస్తున్న రామభక్తులు

గజ్వేల్, జనవరి 3: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం రామభక్తులు ప్రారంభించారు. గజ్వేల్ పట్టణంలోని 19వ వార్డులో గుంటుకు శ్రీనివాస్, మామిండ్ల నాగులు, తమ్మిళి శ్రీనివాస్, పిట్ల నాగరాజు, మహిపాల్‌రెడ్డిలు, ప్రజ్ఞాపూర్‌లోని 3వ వార్డులో కుర్రె సాయిరెడ్డి, రొట్టెల శ్రీనివాస్, మహేందర్‌రెడ్డిలు ఇంటింటికీ తిరుగుతూ అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హిందువులు వారిని మంగళహారతులతో ఇళ్లలోకి ఆహ్వానించి, అక్షింతలను స్వీకరించారు.

సుష్మదర్మకు ఓయూ డాక్టరేట్



సుష్మదర్మ

తార్నాక, జనవరి 3: జనగామ జిల్లాకు చెందిన సుష్మదర్మ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను పొందారు. ఓయూ తెలుగు విభాగంలో డా. కాకునూరి సూర్యనారాయణ మూర్తి పర్యవేక్షణలో సిద్దిపేట జిల్లా సాహిత్యం - ఒక పరిశీలన అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను డాక్టరేట్ పట్టాను పొందినట్టు బుధవారం ఆమె తెలిపారు. సుష్మదర్మకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఓయూ ప్రొఫెసర్లు, ప్రముఖ సాహితీవేత్తలు ప్రత్యేకంగా అభినందించారు. కాగా సుష్మ ప్రస్తుతం మహబూబాబాద్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో తెలుగు శాఖాధిపతిగా పని చేస్తున్నారు.

పెద్ద చెప్యాలలో తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తపస్ నాయకులు

మిరుదొడ్డి, జనవరి 3: మండలంలోని పెద్ద చెప్యాల గ్రామంలోని బుధవారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తపస్(టీపీయూఎస్) 2024 నూతన సంవత్సర క్యాలెండరును ఆ సంఘం మండల అధ్యక్షుడు లోకేష్, చంద్రశేఖర్‌శర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్ సంఘం నాయకులు మల్లేశం, కిష్టారెడ్డి, శ్రీనివాస్, రాజిరెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మూరీ.. పద్ధతి మార్చుకో: సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

చేర్యాల, డిసెంబరు 3: చేర్యాల మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పద్ధతి మార్చుకుని ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పేర్కొన్నారు. చేర్యాల మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల ప్రాంత సమస్యలు పట్టించుకోకుండా అక్రమాలకు పాల్పడుతున్నాడని విమర్శించారు. పట్టణంలోని సర్వే నంబర్ 984లో దేవాదుల కెనాల్ కాలువ నిర్మాణానికి ప్రభుత్వం పరిహారం అందించినా, కొమ్మూరి ఆ స్థలాన్ని ఆక్రమించి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. వివాదాస్పద చేర్యాల పెద్దచెరువు మత్తడి స్థల విషయంలో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, అతడి కూతురు తుల్జా భవానీరెడ్డి, జితేందర్‌రెడ్డి, మారుతీ ప్రసాద్‌లతో ఎన్నికలకు ముందు ఒప్పందం కుదుర్చుకుని ప్రజలను మోసం చేశాడని ఆరోపించారు. ఎన్నికలకు ముందు చేర్యాల ప్రాంత ప్రజలకు కొమ్మూరి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్ మావో, ఆలేటి యాదగిరి, బద్దిపడిగ కృష్ణారెడ్డి, చొప్పరి రవికుమార్, పోలోజు శ్రీహరి, ఇప్పకాయల శోభ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రులను కలిసిన కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్, జనవరి 3: హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను బుధవారం పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. సీఎంను కలిసినవారిలో సిద్దిపేట యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాసుద్దీన్, నజ్జు తదితరులు పాల్గొన్నారు. పీసీసీ కార్యదర్శి గంప మహేందర్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను నాయకులు, కార్యకర్తలతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిద్దిపేట నుంచి కేబినెట్ హోదా కల్పించేలా స్థానిక నాయకుడికి అవకాశమివ్వాలని కోరినట్లు ఆయన చెప్పారు.

సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన మొగుళ్ల రాజిరెడ్డి



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి రాజిరెడ్డి

చేర్యాల, జనవరి 3: చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధిమొగుళ్ల రాజిరెడ్డి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాదులోని సీఎం నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జనగామ నియోజకవర్గ అభివృద్ధితో పాటు చేర్యాల ప్రాంత పరిస్థితులపై చర్చించారు.

దుబ్బాకను సస్యశ్యామలం చేయడమే లక్ష్యం: దుబ్బాక ఎమ్మెల్యే



గంబీర్‌పూర్‌లో అసంపూర్తి కాలువల పనులను పరిశీలిస్తున్నఎమ్మెల్యే కేపీఆర్

దుబ్బాక, జనవరి 3: దుబ్బాక నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా తాను పని చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మల్లన్నసాగర్ ద్వారా చెరువులకు అందాల్సిన నీటికాలువల అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం దుబ్బాక మండలంలోని అచ్చుమాయిపల్లి, పోతారం, గంబీర్‌పూర్ గ్రామంలో మల్లన్నసాగర్ ఎల్4 కాలువను, సుమారు 15 కిలోమీటర్ల పొడువునా నిర్మించనున్న కాలువల పనులను ఆయన పరిశీలించారు. దుబ్బాక నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లోకి వచ్చే కాలువల డిజైన్‌ను కూడా పరిశీలించి మాట్లాడారు. మల్లన్నసాగర్‌తో దుబ్బాక నియోజక వర్గం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఈ ప్రాంతంలో భూగర్భజలాలు దండిగా పెరిగాయన్నారు. అత్యధికంగా వరిపంట పండించిన నియోజకవర్గంగా దుబ్బాక ఉందన్నారు. కూడవెళ్లిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. దుబ్బాక నియోజక వర్గంలో లక్షా 40 వేల ఎకరాలలో సాగునీరందించేందుకు కాలువలను పూర్తి చేయిస్తానన్నారు.

నియోజకవర్గంలోని నీటికాలువలను పూర్తి చేయడంతోపాటు, సాగునీరందించేందుకు కూడా పనులను చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కాగా దుబ్బాకలోని కేసీఆర్ స్కూల్‌ను ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. స్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. దుబ్బాక - రాజక్కపేట రహదారి పనులను కూడా పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు కిషన్‌రెడ్డి, గడీల జనార్దన్‌రెడ్డి, బానాలశ్రీనివాస్ తదితరులున్నారు.

హుస్నాబాద్‌లో ఎల్ఐసీ ఉద్యోగుల ధర్నా



హుస్నాబాద్ ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు

హుస్నాబాద్, జనవరి 3 : హుస్నాబాద్ పట్టణంలోని ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయం ఎదుట బుధవారం ఎల్ఐసీ ఆఫీసర్స్, ఉద్యోగుల జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వేతన సవరణ చర్చలు వెంటనే ప్రారంభించాలని, నూతన పెన్షన్ స్కీం కవర్ అవుతున్న ఉద్యోగులకు యాజమాన్యం చెల్లించే కంట్రిబ్యూషన్ 10 నుంచి 14 శాతానికి పెంచాలని, అన్ని క్యాడర్లలో రిక్రూట్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కె రవీందర్, బి రవీందర్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సదాశివరెడ్డి తదితరులున్నారు.

'జ్యోతిబాపూలే'లో స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ



వర్గల్ ఎంజేపీలో మాట్లాడుతున్న ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి డాక్టర్ నిఖిత

వర్గల్, జనవరి 3: వర్గల్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ అసోసియేషన్ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టీఏఎస్‌కే)సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మహీంద్రా ప్రైడ్ స్కిల్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి డా. నిఖిత ఆధ్వర్యంలో పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావుతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, జనవరి 3: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ డంపింగ్ యార్డును మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త సేకరణను, డంపింగ్ యార్డులో జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఆయనవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నర్సాపూర్‌లో రీజినల్ స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన

నర్సాపూర్, జనవరి 3: నర్సాపూర్ గిరిజన గురుకులంలో బుధవారం రీజినల్‌స్థాయిలో రెండురోజుల పాటు నిర్వహించే విద్యావైజ్ఞానిక ప్రదర్శనను ఎంపీపీ జ్యోతిసురేష్ నాయక్, రీజినల్ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. విద్యావైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించవచ్చన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సునీతాబాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ భిక్షమయ్య పాల్గొన్నారు. ప్రదర్శనలో 24 రకాల ప్రదర్శనలు ఉంటాయని, అందులో ఆర్ట్స్, కల్చరల్, యూత్‌పార్లమెంటు, సైన్స్‌ఫేర్, ఉపన్యాసం, వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్, ఫ్యాన్సీ తదితర అంశాలు ఉంటాయని రీజినల్ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్ తెలిపారు.

గ్రామాల్లో కొనసాగుతున్న 'ప్రజాపాలన'



హుస్నాబాద్ మండలం మాలపల్లిలో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న ఎంపీపీ, ఎంపీడీవో



గజ్వేల్ మండలం బెజుగామలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో మచ్చేంద్ర



జగదేవ్‌పూర్: చాట్లపల్లిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



చిన్నకోడూరు మండలం రామంచలో దరఖాస్తును స్వీకరిస్తున్న సిద్దిపేట ఆర్డీవో రమేష్ బాబు

హుస్నాబాద్/ హుస్నాబాద్‌రూరల్, జనవరి 3: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన గ్రామ సభలను అర్హత కలిగిన ప్రతీ కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లకావత్ మానస, ఎంపీడీవో రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామంలో ప్రజాపాలన గ్రామ సభలో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారంటీలలో అవసరమైన పథకాల కోసం దరఖాస్తులను పూర్తి చేసి గ్రామసభలో అధికారులకు అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బత్తుల మల్లయ్య, ఎంపీటీసీ అన్నపూర్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు కాగా హుస్నాబాద్ పట్టణంలో జరిగిన ప్రజా పాలన అభయ హస్తం వార్డుసభల్లో బుధవారం 516 దరఖాస్తులు వచ్చాయి. పట్టణంలోని 20 వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించగా ఇప్పటి వరకు మొత్తం 5,564 దరఖాస్తులు వచ్చాయి. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌తో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గజ్వేల్ మండలంలో..

గజ్వేల్/గజ్వేల్ రూరల్, జనవరి 3: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తుల స్వీకరణను మున్సిపాలిటీ పరిధిలోని 2, 4వ వార్డులో బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఆయన వెంట కౌన్సిలర్లు బాలమణి, పంబాల అర్చన, నాయకులు ఉన్నారు. అదేవిధంగా గజ్వేల్ మండలంలోని బెజుగామ, సింగాటం, పిడ్‌చెడ్, రాగట్లపల్లిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. బెజుగామలో ఎంపీడీవో మచ్చేంద్ర మాట్లాడుతూ ప్రజలు ఏమాత్రం ఆందోళన చెందకుండా అధికారులతో సందేహ నివృత్తి చేసుకుని దరఖాస్తులను నింపాలని సూచించారు. బెజుగామ, సింగాటం గ్రామాలో ఎంపీడీవో మచ్చేంద్ర, పిడ్‌చెడ్, రాగట్లపల్లిలో తహసీల్దార్ బాలరాజు 2 టీమ్‌లుగా ఏర్పడి ఆయా శాఖల అధికారులతో కలసి అర్హులైనవారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి సునీత, ఆయా శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కుకునూరుపల్లి మండలంలో...

కొండపాక, జనవరి 3 : కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్, బొబ్బాయిపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నాగేందర్, తహసీల్దార్ మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాట్లపల్లిలో...

జగదేవ్‌పూర్, జనవరి 3: ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చాట్లపల్లి గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేష్, కొండపోచమ్మ ఆలయం మాజీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎంపీటీసీ కావ్యదర్గయ్య, అధికారులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు మండలంలో..

చిన్నకోడూరు, జనవరి 3: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం చిన్నకోడూరు మండలంలోని విఠలాపూర్, రామంచ, మాచాపూర్, చౌడారం గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి అధికారులు ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించి, అభయ హస్తం దరఖాస్తులను స్వీకరించారు. రామంచ గ్రామాన్ని సిద్దిపేట ఆర్డీవో రమేష్ బాబు సందర్శించి, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీవో సోమిరెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

వర్గల్, జనవరి 3: పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వర్గల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అట్ల సందీప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వర్గల్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, గ్రామ సర్పంచ్ తూంకుట గోపాల్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికిరణ్, ఆర్ఐ రాజు, ఉప సర్పంచ్ పసుల రమేశ్ ముదిరాజ్, కార్యదర్శి సందీప్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



వర్గల్‌లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అర్హులైనవారు దరఖాస్తు చేసుకోండి

తొగుట, జనవరి 3: అర్హులైన ప్రతీ కుటుంబం ప్రజా పాలన కార్యక్రమంలో సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కాన్గల్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని గుడికందుల గ్రామంలో ఎంపీడీవో శ్రీధర్‌తో కలిసి ప్రజాపాలన దరఖాస్తులను ప్రజల నుంచి తీసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లయ్య, ఎంపీటీసీ కవిత, ఎంపీవో చందన, విద్యుత్ ఏఈ శ్రీనివాస్ రావు, ఏపీఎం మగ్దుం అలీ, నాయకులు పద్మారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



తొగుట: గుడికందులలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న హరికృష్ణారెడ్డి